# కనకదురగమ్మ మాత్యం

"దురగా టీ సల్లారిపోతున్నాది. పొద్దుటేళ సదివిన పేపరేకందా! మళ్లీ అంత సేపేం సదువుతావే!" అన్న నరసమ్మ కేక విని పేపరు పక్కనపెట్టి టీ కప్పు అందుకుంది కూతురు దుర్గ.

"ఇది ఇవ్వాల్టి పేపర్‌కాదు. వారంరోజుల్కితంది. హైదరాబాద్ నుంచి మా ఫ్రెండ్ పనిగట్టుకుని ఇందులో ప్రకటన చూడమని ఫోన్ చేసింది. ఈ పేపర్ మా ఆఫీస్ నుంచి తెచ్చాను" అంది దుర్గ ఆ ప్రకటన మరోసారి చదువుతూ.

"ఏంటది?" అడిగింది తల్లి అది ఇంగ్లీష్‌పేపరని గమనించి.

"పెళ్లికూతురుకోసం ఇచ్చిన ప్రకటనకాదులే!" అంది దుర్గ నవ్వుతూ.

"అవును మరి. నీకు పెళ్లికేటి తొందరొచ్చింది! నీ వయసోళ్ల పెళ్లిళ్లై పిల్లల్ని కంటావున్నారు."

"ఇది నీకు పాతపాటే. సత్యం ఇజనీరింగ్ చదువైపోయింది. వాడేదైనా ఉద్యోగంలో స్థిరపడ్డాక నా పెళ్లిగురించి ఆలోచిద్దాం. ఈలోగా నాకు తెలియకుండా వాడూ, నువ్వూ కలిసి ఎన్ని ప్రకటనలకి నా ఫోటోలు, జాతకాలు పంపినా పోస్టు ఖర్చుల దండగ. చూసుకోడానికి వాళ్లు వస్తానన్నా, నన్ను రమ్మన్నా వాళ్లని కలవను, జవాబివ్వను."

"సరేలే నువ్వుసూత్తున్నదేటి"

"ఓ పెద్దకంపెనీలో పర్సనల్ సెక్రటరీ ఉద్యోగం ఖాళీ వుందట. బి.కాం. డిగ్రీ, టైపు, షార్ట్‌హాండు, కంప్యూటర్‌కోర్సులోనూ, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లోనూ డిప్లొమాలు వుండాలిట. జీతం పదివేలు, పైన ఎలవెన్సులు."

"అయ్యన్నీ నీకున్నాయికందా! నీకోసమే వే7సినట్టుంది పేపర్లో."

"అదే ఆశ్చర్యంగా వుంది. పర్సనల్ సెక్రటరీ పోస్టుకీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ డిప్లొమా ఎందుకో!"

"ఎందుకేటి! ఈ ఉజ్జోగం నీకు రానాకి. అంతా ఆ కనకదురగమ్మ దయ! నీకాయమ్మ పేరెట్టుకున్నాంగదా! అంతా ఆయమ్మే సూసుకుంటాది. సూత్తావుండు, ఈ వుజ్జోగం నీకే

వస్తాది. దాంతో కానీ కట్నలేకుండా నిన్ను కట్టుకుంటామంటూ ఎగబడతారు పెళ్లికొడుకులు" అంది నరసమ్మ.

"అలాగే కలలుకంటూ వుండు. ముందీ ఉద్యోగానికి దరఖాస్తుపెట్టనీ. రేపు ఆదివారం. ఎల్లుండి పంపాలి. ఇప్పటికే ఆలస్యమైపోయింది."

"ఉజ్జోగం ఎక్కడేంటి?"

"హైదరాబాద్‌లో"

"ఓలమ్మో! వున్నవూరు ఈ యిజయవాడిడిసిపెట్టి అయిదరాబాదా! ఆడ ఎంత జీతవైనా ఇంటద్దికే సాల్దంట!"

"ఉద్యోగమంటూ వొస్తే నేనొక్కర్తినీ మా ఫ్రెండ్ భారతి లాగ అక్కడ వర్కింగ్ ఉమెన్స్ హాస్టలుంది. అందులో వుంటాను. నువ్వు తమ్ముడితో ఎక్కడుద్యోగం దొరికితే అక్కడికెడతావు" అంది దుర్గ తల్లి భుజాలు పట్టుకుని ఆప్యాయంగా కుదుపుతూ.

★ ★ ★

విజయవాడలో ఓ ప్రయివేట్ స్కూల్లో దుర్గ తండ్రి వాచ్‌మెన్‌గా వుంటూ ఎనిదేళ్లక్రితం కేన్సర్ వ్యాధితో పోయాడు. ఆ స్కూల్ హెడ్‌మాస్టర్ రామ్మూర్తిగారికి ఈ కుటుంబంపట్ల సానుభూతితో పాటు పిల్లలిద్దరిమీదా అభిమానం వుంది. ప్రావిడెంట్‌ఫండ్, గ్రాట్యుటీ బాపతు ఓ ముప్పయి వేలొస్తే వాళ్లపేర బ్యాంక్‌లో వేశాడు. దుర్గ అప్పటికి బి.కాం, ఫైనలియర్‌లోనూ, సత్యం టెన్త్‌లోనూ వున్నారు. నరసమ్మకి స్వీపర్ ఉద్యోగం ఇప్పించి, ఆ కాంపౌండ్‌లోనే ఇన్నాళ్లూ వున్న షెడ్‌లోనే ఇంకొన్నాళ్ళుండనిచ్చాడు. ఉండటం రేకులషెడ్డయినా, ఆయన చలవవల్ల స్కూలువేళల అనంతరం పగలూ, రాత్రీ ఆ స్కూలు వరండాలోనే చదువుకుంటూ కాలక్షేపం చేశారు. దానికి సాయం నర్సమ్మ విద్యార్థుల టిఫెన క్యారియర్లు కడుగుతూ మరో నాలుగురాళ్లు సంపాదించేది.

దుర్గ బి. కాం పాసవ్వగానే రామ్మూర్తిగారు తనదగ్గిర చదువుకుని పైకొచ్చిన ఓ పారిశ్రామికవేత్తకి చెప్పి ఉద్యోగం ఇప్పించాడు.

ఉద్యోగంలో చేరేముందు తన ఆశీస్సులకోసం వచ్చిన దుర్గకి "నీకు చక్కనిరూపం వుంది, చదువుంది. ఇప్పుడు ఉద్యోగంకూడా వుంది. వీటితోబాటు వినయవిధేయతలు, పట్టుదల, ఆత్మవిశ్వాసం వుంటే నీకు మంచి భవిష్యత్తుంటుంది. మీ తమ్ముడు సత్యాన్ని పైకి తీసురాగలుగుతావు. ఇప్పుడు రోజులు బాగాలేవు. జాగ్రత్తగా వుండాలి. ఈ నాటి

యువతీయువకుల్లో సామాజిక విలువలు, క్రమశిక్షణ లోపించాయి. చదువు, సంపాదన, స్వయంకృషిమీదకంటే వాళ్ల ధ్యాస విచక్షణాజ్ఞానంలేని ప్రేమ, పెళ్లి, రొమాన్స్, సెక్స్‌మీద ఎక్కువగా వుంది. ఇది సాంఘిక వాతావరణకాలుష్య ప్రభావం. అందుకే నిత్యం వార్తల్లో స్త్రీలమీద అత్యాచారాలు, పెళ్లి పేర మోసాలు, వరకట్నచావులు, ఆత్మహత్యలు..." అంటూ హితోపదేశం చేశారు.

"లేదుసార్ చాలా జాగ్రత్తగా నడుచుకుంటాను. మీరే మాకు పెద్దదిక్కు. మీ మాటలు మరిచిపోను" అంటూ ఆయన పాదాలకు నమస్కరించింది. ఆయన హెచ్చరికకు కారణం దుర్గకి తెలుసు, ఆయన మూడోకూతురుది ప్రేమవివాహం. ఆవిడే దుర్గకి ఫైనలియర్‌లో కామర్స్ లెక్చరర్.

గత ఎనిమిదేళ్ల జీవితానుభవం దుర్గకొక సుదీర్ఘ మహాయజ్ఞం. ఉద్యోగంచేసుకుంటూ ప్రయివేటుగాచదువుకుని ఆ డిప్లొమాలన్నీ సంపాదించింది. తల్లికి టైలరింగ్ నేర్పించింది. పిల్లలకి యూనిఫాంలు కుట్టడంలో నరసమ్మ ప్రావీణ్యం సంపాదించింది. తమ్ముడు సత్యంషెడ్యూల్ కులాలకున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ఇంజనీరింగ్ కోర్స్ పూర్తి చేశాడు. వెయ్యిరూపాయిల నుంచి తన జీతం అయిదువేలయింది. ఆఫీసులో తోటి ఉద్యోగులు, బయట రౌడీమూకచేసే ఇకిలింపులు, సకిలింపులు, వెర్రిమొర్రి వేషాలు, వేధింపులు ధైర్యంగా ఎదుర్కొంది. కరాటే కూడా నేర్చుకుంది.

ఇన్నాళ్లూ పెళ్లి ఆలోచనకు దూరంగా వుండబట్టే ఈపాటి సంతృప్తి, సంతోషం సాధించగలిగానంటుంది. 'ఓ స్త్రీ! నువ్వు అబలవు. నీకు పురుషుడి రక్షణ అవసరం. పెళ్లి నీకో వరం. పాతివ్రత్యం నీ ధర్మం. మాతృత్వం నీ జీవితపరమావధి' అంటూ యుగయుగాలుగా వినపడేశాస్త్ర ఘోషతో చెవులు గింగురుమనడం చేత స్త్రీ ఆలోచనాశక్తి స్తంభించిపోయింది. ఆచారంలాంటి శక్తివంతమైన మత్తుమందు మరోటి లేదని త్రికరణశుద్ధిగా నమ్మింది దుర్గ.

★ ★ ★

ప్రకాశ్‌నగర్‌లో రెండు పెద్ద గదుల్తో మరికాస్త వాసయోగ్యంగా వున్న ఇంటిభాగంలోకి రెండేళ్ల క్రితం మారింది దుర్గ. అక్కడికి కనకదుర్గ ఆలయం రెండు కిలోమీటర్లు. పది నిమిషాలకో సిటీబస్. ప్రతి ఆదివారం ఉదయం దుర్గని వెంటబెట్టుకు ఆలయానికి వెళ్లేది నరసమ్మ. తనకి భక్తి, విశ్వాసాలమాటెలాగున్నా తను వెంటవస్తే తల్లి ఎంత సంతోషిస్తుందో తెలిసిన దుర్గ ఎప్పుడూ బద్ధకించలేదు.

ఆలయానికి వెళ్లినప్పుడల్లా తల్లి నూట ఎనిమిది ప్రదక్షిణాలు పూర్తిచేసుకువొచ్చేవరకూ ఆలయ ప్రాంగణంలోవున్న పూలతోటలో నిరీక్షిస్తూ కూర్చోవడం దుర్గకి పరిపాటి. తర్వాత ఇద్దరూ కలిసి దర్శనంచేసుకెళుతుంటారు. క్రితం సాయంత్రం చూసిన ప్రకటన గురించి ఆలయంలో కూర్చుని దుర్గ ఆలోచించసాగింది. తనకి అన్ని అర్హతలూ వున్నాయి. ఈ ఉద్యోగం వస్తే తను జీవితంలో గొప్ప విజయం సాధించినట్లే. ఇప్పుడు తను పనిచేస్తున్న కంపెనీ ఎండీకూడా సంతోషించి ఆశీర్వదించి పంపించే శ్రేయోభిలాషి. ఇలా ఆలోచిస్తుండగా....

"హమ్మయ్య" అని ప్రక్కన ఒకావిడ కూర్చుని ఒక క్షణం చీరచెంగుతో విసురుకుని దుర్గతో "అమ్మాయ్ నువ్వు నరసమ్మగారి కూతురు దుర్గవేనా" అని అడిగింది.

ఆవిణ్ణెప్పుడూ చూసిన గుర్తు లేదు. వయస్సు సుమారు అరవయ్యేళ్లుంటాయి. మంచి విగ్రహం. మొహంలో తేజస్సు రెట్టింపుచేస్తూ పెద్దబొట్టు. ఓ చేతికి రిస్ట్‌వాచి, మరోచేతికి నాలుగు బంగారు గాజులు, మెడలో రెండుపేటల గొలుసు. చేతిలో పూలసజ్జ.

"మీరు మా అమ్మని ఎరుగుదురా?" అని అడిగింది దుర్గ.

"నా పేరు భవాని. నేను మీ అమ్మనెరుగను. ఆవిడ నన్నూ ఎరుగదు. ఇందాకా నేను ప్రదక్షిణం చేస్తూండగా చూశాను. ఆ దారిలో కోతి అనుకుంటాను పాడుచేసినట్టుంది. ఒకటే వాసన. భక్తులందరూ దూరదూరంగా వుండి ప్రదక్షిణం చేస్తున్నారు. చేతిలో తువ్వాలుంటే సగం చింపి, మీ అమ్మగారు ఆ మాలిన్యం అంతా ఎత్తిపారేసి, నీళ్లు తెచ్చి మిగిలిన సగం తువ్వాలుతోనూ కడిగి తుడిచి బాగుచేసింది. ఆమె పట్టుచీర, మెళ్లో సన్నని రుద్రాక్షమాల, నుదుట విభూతి, మొహంలో శాంతం, ఆమె చేసిన పనీ చూసి 'అదీ నిజమైన భగవత్సేవ" అనిపించి పైకి అనేశాను. అది విని ఒకావిడ చెప్పింది. ఆవిడపేరు నరసమ్మనీ, కూతురిపేరు దుర్గనీ, చక్కగా వుంటుందనీ, ఇద్దరూ ప్రతి ఆదివారం వస్తూంటారనీ" అంది ఆవిడ నవ్వుతూ.

ఆమె మాటతీరులో హుందాతనం, సంస్కారం దుర్గని ఆకర్షించాయి.

భవానీగారు మాటల్లోదింపి తన చదువు, ఉద్యోగం, తమ్ముడి చదువు, తల్లి కృషి, రామ్మూర్తి మేష్టారి అభిమానం గురించీ దుర్గచేత చెప్పించింది.

"చాలా సంతోషం. నువ్వు పడ్డ కష్టాలన్నిటికీ నీ ఆత్మవిశ్వాసమే నీకు రక్ష. అసలు కష్టాల్లేందే సుఖం విలువ తెలియదు. నీకున్న క్వాలిఫికేషన్స్‌కి హైదరాబాద్‌లో ఇక్కడి కంటే మంచి అవకాశాలుంటాయేమో!"

"నా తమ్ముడి చదువై పోయింది కనక ఇకమీదట ప్రయత్నిస్తాను. రేపే ఓ మల్టీనేషనల్ కంపెనీ వైస్‌ప్రసిడెంట్‌కి పర్సనల్ సెక్రటరీ..."

"పర్సనల్ సెక్రటరీ పోస్టా! యు హావె ఛార్మింగ్ పెర్సనాల్టీ. అసలు ఔటర్‌వ్యూలోనే సెలక్టయిపోతావు, ఇంక ఇంటర్‌వ్యూలో వాళ్లమొహం వాళ్లేమడుగుతారు! అయినా నీకు అనుభవం వుంది."

"ఆ ధైర్యంతోనే అప్లయ్ చేద్దామనుకుంటున్నాను."

"తప్పకుండా చెయ్యి. అదిసరే ఉద్యోగమొస్తే నిన్ను పెళ్లిచేసుకోడానికి పెళ్లికొడుకెవరైనా రెడీగా...."

"లేదు. నాకింకా ఆ ఆలోచన లేదు."

"పర్సనల్ సెక్రటరీ అంటే మీ బాస్‌తో ఎక్కడికైనా అవసరమొస్తే టూర్ చెయ్యవల్సొసుందేమో!"

"వెడతాను. నాకేవిధమైన సంకోచం, భయం లేవు."

"మరైతే నువ్వు సెలెక్టయిపోయినట్టే. కంగ్రాట్స్" అంటూ నాటకీయంగా అభినందనపూర్వకంగా కరచాలనంచేసింది, లేచివెళ్లే ప్రయత్నంలో.

"మీ అభినందన ఆశీర్వచనంగా భావిస్తాను. మీ ప్రోత్సాహానికి నా ధన్యవాదాలు. నమస్కారం." అంది పొద్దున్నే అంత సరదా అయిన అనుభవజ్ఞురాలు, విజ్ఞురాలైన మనిషితో పరిచయమైనందుకు ఆనందిస్తూ.

తల్లి వొచ్చి భుజంమీద చెయ్యివెయ్యగానే దుర్గ ఈలోకంలో కొచ్చింది. దర్శనంచేసుకుని ఇంటికి వెడుతున్నప్పుడు భవానీగారితో పరిచయం, ఆమె మాటలు ఇచ్చిన ధైర్యం గురించీ తల్లితో చెప్పింది.

"అంతా కనకదుర్గమ్మ దయ. ఆదేవి మాటలే ఈయమ్మ నోటి నుంచొచ్చినయ్." అంది సరసమ్మ.

సోమవారం రిజిస్టర్డ్ పోస్ట్‌లో తనకొచ్చిన ఉత్తరం చూసి దుర్గ నిర్ఘాంతపోయింది. ఏ కంపెనీలో ఉద్యోగానికి అప్లయ్ చెయ్యాలనుకుందో ఆ కంపెనీ పర్సనల్ ఆఫీసర్ దగ్గిర్నుంచే వచ్చిందా ఉత్తరం. దాని సారాంశం ఇది: "నాలుగురోజుల క్రితం మీరు పంపిన దరఖాస్తు అందింది. బుధవారం ఉదయం పదకొండుగంటలకి హైదరాబాద్ హెడ్డాఫీస్‌లో ఇంటర్వ్యూకి రాకోరుతున్నాం."

అసలు తను అప్లయ్‌చెయ్యలేదు. పత్రికలో చూసిన ప్రకటనలో ఫోటో, బయోడేటా, సర్టిఫికెట్ల కాపీలు పంపమని వుంది. అంచేత తన పేర తనకి తెలియకుండా అప్లయ్‌చేసే అవకాశంకాని, అవసరంకాని ఎవరికీలేదు.

ఆ వొచ్చిన ఉత్తరంగురించి అడిగితే తల్లి చెప్పింది, తడుముకోకుండా "అంతా ఆ కనకదురగమ్మ మాత్యం." అంది.

ఆఫీసుకెళ్లేక హైదరాబాద్‌లోవున్న భారతికి ఫోన్‌చేసి చెప్పింది. ఇదంతా తనని ఆటపట్టించడానికి ఎవరేనా పన్నిన పన్నాగేమేమో అన్న అనుమానంతో.

నువ్వే ఏ నిద్దట్లోనో అప్లయ్ చేసుంటావు. ఇంక దాన్నిగురించి తర్జభర్జన చెయ్యకుండా, నోరుమూసుకుని అవసరమైతే ఇవ్వడానికిమరో దరఖాస్తుకాపీ వెంట తెచ్చుకుని రేపు సాయంత్రం బయల్దేరి బుధవారం తెల్లారేటప్పటికి ఇక్కడికొచ్చెయ్యి. నీకు అన్ని క్వాలిఫికేషన్లూ వున్నాయి. నీ అప్లికేషన్ అందిందన్నారు, నిన్ను రమ్మన్నారు, ఇంటర్వ్యూ చేస్తారు, సెలక్టవుతావు, ఉద్యోగం వొస్తుంది, నాతోనే ఇక్కడ వుండావు. గుడ్‌డే" అని ఫోన్ పెట్టేసింది. అదసలే పెంకిఘటం. దాని కాబోయే భర్త పోలీస్ ఇన్‌స్పెక్టర్.

★ ★ ★

'ఆర్. కె. ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్' అని బోర్డ్‌వున్న గదిలోకి కూడావుండి పర్సనలాఫీసర్ తీసుకెళ్లాడు.

ఆ ప్రసాద్ వయస్సు ముప్ఫయ్యేళ్లుంటాయి. మంచి ముఖ వర్చస్సు, ఫుల్‌సూట్‌లో వచ్చాడేమో హేంగర్‌కి కోటువేళ్లాడదీసివుంది. ఎదురుగావున్న కుర్చీలో కుర్చోమని సగౌరవంగా ఆహ్వానించాడు. అతనిముందు పర్సనల్ ఆఫీసర్ వుంచిన ఫైల్లోని అప్లికేషన్ ఫార్మ్‌లో తన ఫోటో, సర్టిఫికెట్లు వుండటం గమనించింది. ఓ సారి ఆ ఫైలు తిరగేసి, ఇంక దానితో పనిలేదన్నట్ట మూసేసి ప్రక్కన కూర్చున్న పర్సనలాఫీసర్‌వైపు నెట్టేశాడు. దుర్గ ప్రయాణం గురించి, ఇక్కడ బస గురించి, తిరుగుప్రయాణం గురించి, కుశలప్రశ్నలు వేశాక "యు ఆర్ సెలెక్టెడ్. ఈ ఉద్యోగంలో చేరుతున్నదీ లేనిదీ, చేరితే ఎప్పుడు చేరేదీ వారంరోజుల్లోగా తెలియచెయ్యండి" అని చెప్పి ఆ ఫైలుమీద ఏదో రాసి పర్సనల్ ఆఫీసర్‌కి అందిస్తూ, దుర్గకేసి చూసి "ఒకపావుగంట ఆగి లెటరాఫ్ అపాయింట్‌మెంట్, మీరు ఇంటర్వ్యూ కొచ్చినందుకు మీకు కంపెనీ రూల్స్ ప్రకారం రావాల్సిన టియ్యేడియ్యే తీసుకు వెళ్లండి. బెస్టాఫ్‌లక్ అండ్ గుడ్‌డే" అని ఇద్దరితోనూ కరచాలనంచేసి పంపించేశాడు.

దుర్గ తనకీ ఉద్యోగం ఇంత సులభంగా వస్తుందని కలలో కూడా అనుకోలేదు. అసలు అప్లికేషనేనా పెట్టలేదు.

తిరిగొచ్చాక జరిగిందంతా తల్లికి చెప్పింది. తను అనుకున్నట్టుగానే "నువ్వెళ్లినకాడినుంచీ ఆ కనకదురగమ్మతల్లికి దణ్ణాలెట్టుకుంటూనే వున్నాను. అంతా ఆ సల్లనితల్లి మాత్యం" అంది.

దుర్గ తన తల్లిని టైలరింగ్ ట్రైనింగ్‌తో బాటు వయోజన విద్యా కేంద్రంలో చేర్పించింది. తన టైలరింగ్ వృత్తికి కావల్సిన పేర్లు, కొలతలు, తేదీలు లాంటివి తప్పులతోనైనా రాసుకోగల చదువు నేర్చుకుంది. అయితే తల్లి మాటల్లో చిన్ననాటినుంచీ అలవాటైన యాస మాత్రం పోలేదు. ఇప్పుడు దుర్గకి తల్లంటే ఎంత ప్రాణమో, తల్లి మాటల్లో వుండే సహజమైన ఆ యాస వినడమన్నా అంత ప్రాణం.

★ ★ ★

ప్రసాద్ విదేశాల్లో ట్రైనింగయ్యి స్వయంకృషితో వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) స్థాయికి ఎదిగాడు. అందరితోబాటు దుర్గనికూడా నవ్వుతూ పలకరించేవాడు. మంచి మాటకారనీ, సమయస్ఫూర్తితో సలహాలివ్వగల పేరుంది. అతని దగ్గిర సెక్రటరీగా వుండటం ఎంత ఆనందదాయకమో అంత మానసిక ఉద్రిక్తతకుగురయ్యే అనుభవమూ వుంది. విధినిర్వహణలో ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా మందలించి, దాన్ని ఏవిధంగా సవరించాలో చెప్పి చేయించి, మళ్లీ కొన్నినిమిషాల్లో మరిచిపోయినట్లే ప్రవర్తించి ఊరట కలిగించేవాడు. ఎన్నో సందర్భాల్లో అతనితో కలిసి విందులూ, వినోద కార్యక్రమాల్లోనూ పాల్గొంది. అతను ఎంత చనువిచ్చినా తమ మధ్యవున్న అంతస్తుల అంతరాలను విస్మరించకుండా తనకుతాను నిర్దేశించుకున్న లక్ష్మణరేఖనుదాటకుండా వివేకంతో ప్రవర్తించేది.

ప్రసాద్‌తో టూర్ వెళ్లి రెండు మూడురోజులున్న సంఘటనలున్నాయి. ఎక్కడికెళ్లినా తన ప్రయాణబడలిక, భోజనవసతుల పట్ల శ్రద్ధచూపేవాడు. ఢిల్లీ వెళ్లినప్పుడు స్వెట్టర్, స్విట్జర్‌లాండ్ వెళ్లినప్పుడువాచ్, హాంకాంగ్‌లో వైట్ ఎంబ్రాయిడరీశారీ కొని, వొద్దనడానికి వీలులేనంత అతి సున్నితమైనమాటల్తో బహూకరించాడు. ఎంత సన్నిహితంగావున్నా ఎన్నడూ ప్రేమ, పెళ్లి అనే వ్యక్తిగతమైన విషయాలమీద సంభాషణ రాలేదు.

రెండురోజులు వరసగా శలవుదినాలొచ్చాయి. అందులోనూ ఉగాది, ఆదివారం ఓ రోజునే అయింది. శనివారం ఉదయానికల్లా విజయవాడ రమ్మని తల్లి రాసింది. తను శుక్రవారం బయల్దేరి విజయవాడ వెళ్లి, సోమవారం ఉదయానికల్లా తిరిగొస్తానని ప్రసాద్‌కి చెప్పినప్పుడు–

"నా హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు. వెళ్లిరా. నీకో శుభవార్త. నా పెళ్లి త్వరలోనే జరగబోతూంది. నువ్వు తిరిగొచ్చేక పెళ్లికూతుర్ని పరిచయంచేస్తాను." అన్నాడు.

"అయితే మీకు రెట్టింపు శుభాకాంక్షలు" అంది దుర్గ ఒక్కక్షణం వివర్ణమైనమొహాన్ని చిరునవ్వుతో కప్పిపుచ్చుకుంటూ. ఈ వార్త ఏమూలో తన అంతరంగంలో చెలరేగిన కలలఅలలకది చెలియలకట్ట. తనని ఎంతో దయతో చూసుకుంటున్న తన బాస్‌కి అన్ని విధాలా అనుకూలమైన జీవితభాగస్వామిని ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించింది.

★ ★ ★

తల్లికోసం నిరీక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో కూర్చునివుండగా "ఏమిటి దుర్గా! దీర్ఘంగా ఆలోచిస్తున్నావు!" అన్న సుపరిచితమైన గొంతువిని ఉలిక్కిపడి ప్రక్కకి చూసింది. భవానీగారు తనవైపే అడుగులేస్తూ ఒస్తోంది.

"రండి రండి. ఉగాది పండుగనాడు మీ దర్శనమవ్వడం మా అదృష్టం. ముందు మీకు శుభాకాంక్షలు. తర్వాత మీ ఆశీస్సులకి ధన్యవాదాలు." అంది దుర్గ.

"థేంక్యూ. ఏమిటి విశేషాలు"

"ఆనాటి మీ ఆశీస్సులు ఫలించాయి. ఆ సెక్రటరీ ఉద్యోగం వచ్చింది. రెండునెలలక్రితం చేరాను. అంతా మీ నోటిచలవే" అంది దుర్గ లేచి ఎదురుగా వున్న ఆమె పాదాలకు నమస్కరిస్తూ.

"శీఘ్రమేవకళ్యాణప్రాప్తిరస్తు" ఆశీర్వదించింది భవానీగారు.

"మరీ అంత శీఘ్రంగా వద్దు లెండి. పైగా నేనింకా వరాన్వేషణ ప్రయత్నంలో లేను. అంచేత ఆ అవకాశంలేదు."

"ఈ పురుషాధిక్య సామాజిక వ్యవస్థలో నా స్వాతంత్ర్యాన్ని త్యాగం చేసి బానిసత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేను. నేనున్న పరిస్థితిలో పెళ్లంటే కోరి కష్టాల్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది."

"నాన్‌సెన్స్! నేను నీ వయస్సులో వున్నప్పుడు నా పరిస్థితి నీ పరిస్థితికంటే అధ్వాన్నంగా వుంది. నేను పేదకుటుంబంలో పుట్టాను. పైగా మాది హరిజనుల్లో అట్టడుగుకులం. మేముండే వీధిలోనే వున్న సారథి గొప్పింటి యువకుడు. మా ఇంటికి పదిళ్లవతల మేడలో వుండేవాడు. అతనిది అగ్రకులం. నేను ఎమ్మెస్సీ పాసై టెంపరరీగా టీచర్‌గా పనిచేస్తున్నాను. అతని తండ్రి ఎడ్వకేట్. తండ్రి దగ్గరే సారథి జూనియర్‌గా

ప్రాక్టీస్ చేసేవాడు. ఇద్దరం ఎంత జాగ్రత్తగా వున్నా ఎంత వద్దువద్దనుకున్నా ప్రేమలో పడ్డాం. చుట్టుపక్కలవాళ్ల కళ్లపడ్డాం. మాపెద్దలకి పట్టుపడ్డాం. వాళ్ల వాళ్లూ, మావాళ్లూ బెదిరింపులకీ, దౌర్జన్యాలకీ దిగారు."

"మీవాళ్లూనా?"

"మా వాళ్లు మరీను. ఒకటి– అగ్రకులాలంటే అవిశ్వాసం, ద్వేషం. రెండు– మేము పెళ్లిచేసుకుంటే మా సంతానానికి చట్టప్రకారం కులం ప్రాతిపదికమీద వచ్చే రాయితీలు పోతాయి. మూడు– పైగా అవమానాలన్నీ మాకే. నేనే సారధిని వల్లో వేసుకున్నానన్నారు. సారధి ధైర్యంగా నాచెయ్యి పట్టుకుని వాళ్లనీ, వాళ్ల సంకుచిత్వాన్నీ, వాళ్ల ఆస్తిపాస్తుల్నీ వదిలిపెట్టి కట్టుబట్టల్తో ఇల్లు విడిచిపెట్టి వచ్చాడు. రిజిస్టర్ మేరేజ్ చేసుకుని అందరికీ దూరమయ్యాం. మూడేళ్ల రకరకాల కష్టనిష్టూరాల్ని ఎదుర్కొని ఎలాగో నిలబడ్డాం. ఇప్పుడు సారధి లీడింగ్ ఎడ్వొకేట్. నేనీమధ్యనే గరల్స్ పోలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యాను" అంది భవాని.

ఆమె మాటల్లో గర్వంలేదు. జీవిత సాఫల్యతకి సహజమైన సంతోషం ధ్వనిస్తుంది. సమాజంలో మంచితనం, మంచితనానికి గౌరవం అంతరించలేదన్న విశ్వాసం స్ఫురిస్తుంది.

"ప్రేమవివాహాలే అనేక వివాదాలకి, సమస్యలకి దారితీస్తాయి. అందులోనూ వర్ణాంతరవివాహం సుఖాంతమైందంటే మీరు అదృష్టవంతులు, మార్గదర్శకులు."

"సాధారణంగా ప్రేమనేది రూపసౌందర్యం, ధనార్జనపట్ల ఆకర్షణమీద ఆధారపడుంటుంది. కాని మాకు ఆ రెండూ లేవు. నేను కాని, సారధికాని అందమైనవాళ్లం కాము. ఆర్థికంగాకూడా సారధి లా ప్రాక్టీస్‌లో స్థిరపడేవరకూ, మూడేళ్లు చాలా ఇబ్బందులు పడ్డాం. నీకు రూపం, చదువూ, సంపాదనా అన్నీ వున్నాయి."

"థాంక్స్‌మేడం. అసలు పెళ్లి విషయంలో నేనింకా ఓ నిర్ణయానికి రాలేదు." అంది దుర్గ.

"మొన్నమొన్నటివరకూ మా అమ్మాయి అలాగే అనేది. ఇప్పుడు మా ఆర్థికపరిస్థితి, పలుకుబడి బాగున్నాయి. ఇప్పుడు సమాజం మమ్మల్ని సంస్కర్తలుగా గౌరవిస్తుంది. మా అమ్మాయి, అబ్బాయి కూడా బాగుంటారు. మా అమ్మాయికి కావల్సినన్ని మంచి మంచి సంబంధాలొస్తున్నాయి. గతంలో తను పొందిన అనుభవాలు మరచిపోలేదు. డెయిరీఫార్మింగ్‌లో రిసెర్చ్ స్కాలర్‌గా నాలుగునెలలక్రితం ఆస్ట్రేలియా వెళ్లింది. అదేసెంటర్‌లో ట్రెయినింగ్‌కొచ్చిన ఇండియన్ బాయ్‌తో స్నేహం అయ్యింది. తర్వాత

ప్రేమించుకున్నారట. అక్కడే పెళ్లిచేసుకుంటాం అన్నారు. శుభం అన్నాం. పెళ్లి చేసుకున్నారు. ఆ పిల్లవాడు పంజాబీ వాడు. వాళెప్పుడొస్తే అప్పుడే రిసెప్షన్ ఇక్కడ ఏర్పాటుచేస్తాం" అంది భవానీగారు.

"మరి మీ అబ్బాయి..."

"వాడు ఎంటెక్‌పాసయ్యాడు. నాలుగేళ్ల ఉద్యోగంచేశాక ఆ కంపెనీవాళ్లే అమెరికాలో నాలుగేళ్లు ట్రైనింగ్ ఇప్పించారు. పెళ్లిచేసుకోరా అంటే ఇన్నాళ్లూ చెల్లెలి పెళ్లి అవ్వనియ్యండన్నాడు. ఇప్పుడు చేసుకుంటానన్నాడు. చాలా పెద్ద సంబంధాలొస్తున్నాయి. ఈ పెద్దలందరూ కులాంతర వివాహమంటూ ఒకప్పుడు మమ్మల్ని హీనంగా చూసినవాళ్లే. అంచేత ఒక పేద హరిజనపిల్లనిచూసి చేసుకోమన్నాం. సరేనన్నాడు. మూడు నెలలక్రితం డిగ్రీవున్న అందమైన హరిజనపిల్లకావాలి, కట్నం అక్కర్లేదు అని ఫోటోతో బయోడేటా పంపమని బాక్స్‌నెంబర్‌తో ప్రకటనిచ్చాం. గంపెడు అప్లికేషన్లొచ్చాయి. అందులోంది పది ఎన్నికచేసి మావాడికి చూపెట్టాం. చివరికి మా ముగ్గురికి ఓ అమ్మాయి అన్నివిధాలా నచ్చింది. 'ఆ అమ్మాయి మంచి చెడ్డలు మీరు వాకబుచెయ్యండి. మిగిలిన విషయాలు నాకొదిలెయ్యండి' అన్నాడు. ఆ కంపెనీ ప్రెసిడంట్‌తో సంప్రదించి సరిగ్గా ఆ అమ్మాయికున్న అర్హతలేవున్న అవివాహితైన పర్సనల్ సెక్రటరీ కావాలని ప్రకటనిచ్చాడు. ఆ అమ్మాయి అప్లయ్ చెయ్యకపోవడంచూసి, పెళ్లికూతురుగా ఆ అమ్మాయి తల్లీ, తమ్ముడు పంపిన ఉత్తరాన్నే పర్సనల్ ఆఫీసర్‌కిచ్చి ఇంటర్వ్యూకి పిలిపించాడు. ఈలోగా నేనా అమ్మాయినీ, తల్లినీ ఈ ఆలయంలోనే చూశాను. ఆ అమ్మాయి ఇక్కడ పనిచేసిన కంపెనీ డైరెక్టర్‌తోనూ, రామ్మూర్తి మేష్టారితోనూ సారధి సంప్రతించాడు. చాలా బుద్ధిమంతురాలన్నారు. రెండునెలల తర్వాత ఆ అమ్మాయి తనకి అన్నివిధాలా నచ్చిందన్నాడు మా అబ్బాయి. ఇకమరి ఆ కనకదుర్గమ్మ దయవల్ల ఆ అమ్మాయికికూడా నచ్చినతే త్వరగా వాళ్ల పెళ్లి...."

"దైవం మానుషరూపేణా అన్నట్టు... మా పాలిట కనకదుర్గ మీరే" అంటూ గద్గదస్వరంతో దుర్గ భవానీగారికి పాదాభివందనం చేయబోతుంటే ఆమె దుర్గని లేవదీసి అక్కున చేర్చుకుంది.

** వనితాజ్యోతి, సెప్టెంబరు 1998*